బీఆర్ఎస్ బలోపేతానికి సమష్టి కృషి

-జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

బంజారాహిల్స్,ఫిబ్రవరి 3: ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని పటిష్ట పరిచేందుకు కార్యకర్తలు,నేతలు సమష్టిగా కృషి చేయాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్, డైరీలను సోమవారం తెలంగాణ భవన్‌లో కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన అవకాశాలను ఉపయోగించుకున్న కొంతమంది స్వార్థపరులు అధికారం పోయిన తర్వాత వేరే పార్టీలోకి వెళ్లారన్నారు. నాయకుల స్వార్థాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ప్రజలంతా బీఆర్ఎస్ పార్టీ వైపే ఉన్నారనే విషయం ఇటీవల అనేక సందర్భాల్లో బయటపడిందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో మరోసారి బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని, కార్యకర్తలు నిరుత్సాహపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలోమాజీ కార్పొరేటర్ హేమలతాయాదవ్, వివిధ డివిజన్ల నేతలు జేజోల రాజు, తాండ్ర మేఘన, రూపేష్ యాదవ్, శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, నాయకులు

పనిచేసే సంస్థపట్ల నిబద్ధత అవసరం

-ప్రొ.ఘంటా చక్రపాణి

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్,ఫిబ్రవరి 3: పనిచేస్తున్న సంస్థపట్ల నిబద్ధతతో పాటు చేస్తున్న పనిపై అంకిత భావం అవసరమని డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొ. ఘంటా చక్రపాణి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని సెంటర్‌ఫర్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఇటీవల టీజీఎస్పీ ద్వారా నియమితులైన జూనియర్ అసిస్టెంట్స్‌కు వారంరోజుల పాటు శిక్షణా కార్యక్రమాన్ని ప్రొ.ఘంటా చక్రపాణి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొ.చక్రపాణి మాట్లాడుతూ..ప్రభుత్వ రంగంలో పనిచేసే సిబ్బంది ఎప్పటికప్పుడు ఆయా రంగంలో వస్తున్న ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొంటూ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్పాచక్రపాణి, రిజిస్ట్రార్ డా. ఎల్.విజయకృష్ణారెడ్డి, సీఎస్‌టీడీ ఆఫీసర్ ఇన్‌చార్జి డా. పరంకుశం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రేపు జరిగే నిరసనను విజయవంతం చేయాలి

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 3: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈ నెల 5న జరిగే నిరసన కార్యక్రమంలో అధిక సంఖ్యల్లో కార్మికవర్గం పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి పిలుపు నిచ్చారు. సోమవారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్మికవర్గం సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం అణచివేస్తూ వారి బతుకులను చిన్నాభిన్నం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కోడ్‌ల వల్ల కార్మిక వర్గం ఉద్యోగ భద్రత కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు.దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు సంఘటిత పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు.

ప్రహరీ పేరుతో స్థలం కబ్జాకు యత్నం

-తహసీల్దార్ పర్యటనతో బయటపడిన భాగోతం

-జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారుల మద్దతులో ప్రహరీ నిర్మాణం

బంజారాహిల్స్,ఫిబ్రవరి 3: జూబ్లీహిల్స్ డివిజన్ వినాయక్‌నగర్ బస్తీ, దీన్‌దయాళ్ నగర్ బస్తీలలో ప్రభుత్వస్థలాల్లో ఆక్రమణలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండడంతో షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి సోమవారం పర్యటించారు. వినాయక్‌నగర్ వెనకాల పర్వతాంజనేయస్వామి ఆలయం మెట్లదారి పక్కన కొంతకాలంగా ప్రహరీ గోడ నిర్మాణం చేస్తున్నారు. అయితే ప్రహరీని గ్రౌండ్ లెవల్ నుంచి కాకుండా సుమారు 10నుంచి 15 అడుగుల స్థలాన్ని వదిలిపెట్టి నిర్మిస్తుండడంతో సుమారు 200 గజాల స్థలాన్ని బస్తీనేతలు ఆక్రమించేందుకు స్కెచ్ వేస్తున్నారని నమస్తే తెలంగాణ ఇటీవల కథనాన్ని ప్రచురించిన సంగతి తెలిసిందే. వారంరోజులుగా పనులు జరుగుతున్నా స్థానిక రెవెన్యూ సిబ్బంది, బస్తీనేతలు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న విషయంపై స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన తహసీల్దార్ అనితారెడ్డి ఆక్రమణలపై సీరియస్ అయ్యారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారని చెబుతున్న ప్రహరీ విషయాన్ని గురించి తమకు ఎలాంటి సమాచారం ఇవ్వరా.. అంటూ ఇంజజినీరింగ్ విభాగం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్‌దయాళ్‌నగర్‌లో గత ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కోసం సుమారు 2ఎకరాల స్థలాన్ని కేటాయించి జీహెచ్ఎంసీకి అప్పగించారని, ఈ స్థలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు.

వేరే ప్రాంతంలో వరదనీటి ముప్పును తప్పించేందుకు రిటైనింగ్ వాల్ కట్టాలని జీహెచ్ఎంసీ నిధులు మంజూరు చేయగా అధికార పార్టీ నేతల ఒత్తిడితో ఎలాంటి ముప్పులేని ప్రాంతంలో ప్రహరీ నిర్మాణం చేయడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.ఈ మొత్తం వ్యవహారంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు, స్థానిక రెవెన్యూ సిబ్బంది లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుని ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వినాయక్‌నగర్‌లో ప్రభుత్వ స్థలం ఆక్రమణలను పరిశీలిస్తున్న షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి

ప్రైవేట్ అధ్యాపకుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలి

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి3: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేసే అధ్యాపకుల జీవితాలకు భరోసా ఇస్తూ వారి సంక్షేమం కోసం చొరవ చూపాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం(టీఎల్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ యు.సిద్దేశ్వర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు విద్యాసంస్థలలో అధ్యాపకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయాలని సోమవారం బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను టీఎల్ఎఫ్ ప్రతినిధులు కలిసి విన్నవించారు.ఈ సందర్భంగా సిద్దేశ్వర్ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలలో పనిచేస్తున్న అధ్యాపకులకు సరైన వేతనాలు,ఇతర సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అధ్యాపకులకు సంక్షేమ బోర్డు,కనీస వేతనాలను అమలు చేయాలని కోరారు.స్పీకర్ ప్రసాద్‌కుమార్ సానుకూలంగా స్పందించి మీ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో టీఎల్ఎఫ్ నగర అధ్యక్షుడు డాక్టర్ యాదయ్య,వికారాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షుడు గడ్డం రాంచందర్,అధ్యక్షుడు పట్లోల తిరుపతిరెడ్డి,నేతలు ఎండీ.పర్వేజ్,రఘురాంరెడ్డి, బాబులాల్ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలపై అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

మణికొండ, ఫిబ్రవరి 3: మున్సిపాలిటీ కార్యాలయంలో దిగువ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాంపోనెంట్ రుణ మేళాను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని స్కీం సౌత్ ఇండియా ఇన్‌చార్జి కె.సహదేవయ్య కోరారు. సోమవారం నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, చెత్త సేకరణ కార్మికులకు ఆటోలు, సెప్టిక్ ట్యాంకుల, జేసీబీలు ఇతర వాహనాలకు 50శాతం సబ్సిడీ రుణ మేళాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలపై సంబంధిత శాఖ అధికారులు వివరించారు. ఆసక్తి గల కార్మికులు తక్కువ ధరకే రుణాలను పొందే అవకాశాలను కల్పిస్తున్నామన్నారు. అర్హులంతా సద్వినియోగపర్చుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ క మిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి, కాం-అవిదా సౌత్ ఇండియా ఇన్‌చార్జి చిన్ని కృష్ణ,శానిటేషన్ సూపర్‌వైజర్ లచ్చిరాం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

బంజారాహిల్స్.ఫిబ్రవరి 3: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4నుంచి 28వరకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట దాకా కొనసాగే ఈ శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని ఆస్పత్రి వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు గర్భాశయ క్యాన్సర్ రాకుండా యువతులకు ఇచ్చే హెచ్‌పీవీ వ్యాక్సిన్ డోస్‌లు ఫిబ్రవరి నెలమొత్తం తక్కువ ఖర్చులో అందిస్తామని వారు పేర్కొన్నారు. మార్కెట్‌లో రూ.4వేల ఖరీదైన వాక్సిన్‌ను రూ.1500కే అందిస్తామని వివరించారు.

ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీసీ జాకియా సుల్తానా.

నేటి నుంచి ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు

జూబ్లీహిల్స్,ఫిబ్రవరి 3 : యూసుఫ్‌గూడ సర్కిల్‌లో నేటినుంచి ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా తెలిపారు. సోమవారం యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, రహ్మత్‌నగర్, బోరబండ, ఎర్రగడ్డ డివిజన్‌లలోని వార్డు కార్యాలయాలలో ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తొలి విడత ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్లకు దరఖాస్తు చేసుకుని జాబితాలో తమపేర్లు రానివారితో పాటు కొత్తగా ఇండ్లకు దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఆధార్ కార్డు, ఇతర నివాస ధృవీకరణ పత్రాలతో సంబంధిత వార్డు కార్యాలయాలలో సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో యూసీడీ డీపీఓ వెంకట కిషన్ రావు, ఆయా వార్డు అధికారులు పాల్గొన్నారు.

పాలకమండలిని ఏర్పాటు చేయాలి

హిమాయత్‌నగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

హిమాయత్‌నగర్,ఫిబ్రవరి 3: గీత వృత్తిదారుల ఆర్థిక కార్పొరేషన్‌కు పాలకమండలిని ఏర్పాటు చేసి సహకార సంఘాలకు నిధులు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత వృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన కాటమయ్య కిట్స్ గీత కార్మికులకు నామమాత్రంగా అందాయని, వాటిని అందరికీ అందించాలని కోరారు.గీత కార్మికులకు బకాయి ఉన్న రూ.9కోట్ల ఎక్స్‌గ్రేషియా చెల్లించి వృత్తి పెన్షన్ అందించాలన్నారు.వన పెంపకానికి 560 జీవో ప్రకారం సొసైటీలకు భూముల కేటాయింపు చేపట్టి,స్కిల్స్ యూనివర్సిటీలో గీత వృత్తి దారులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేవారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిల్‌గౌడ్,నేతలు ప్రవీణ్,వీరస్వామి,వి.రాంమూర్తి,పుల్లయ్య, జయరాములు, సైదులు, అంజయ్య, యాదయ్య, యాదయ్యగౌడ్,నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

అంబేద్కర్ విగ్రహం వద్ద వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మణికొండ, ఫిబ్రవరి 3: నార్సింగి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద లక్ష-డప్పులు, వేల గొంతుల గోడ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గండిపేట మండల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి పుట్లగారి గణేష్‌మాదిగ హాజరై మాట్లాడుతూ ఈనెల 7న లక్ష డప్పులు వేల గొంతుల మహా ప్రదర్శన ఎల్‌బీ స్టేడియం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు చంకన డప్పు వేసుకొని ప్రతి మాదిగ బిడ్డ, ఉపకులాలు భారీగా తరలిరావాలని పిలుపు నిచ్చారు.

ఈ కార్యక్రమంలో రజనీకాంత్‌మాదిగ, పెద్దపల్లి శంకర్‌మాదిగ, రవికుమార్‌మాదిగ, ఉపేందర్‌మాదిగ, రంజిత్‌మాదిగ, టిల్లుమాదిగ, యాదవ్‌రావుమాదిగ, రోహన్‌మాదదిగ పాల్గొన్నారు.

కొనసాగుతున్న శ్రీ పెద్దమ్మతల్లి

వార్షికోత్సవాలు

జూబ్లీహిల్స్‌లోని శ్రీ పెద్దమ్మ ఆలయం వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున అమ్మవారికి విశేష అభిషేకం, మంత్రపుష్పం, మండపపూజలు. వేదపారాయణం, దేవీ భాగవతం, చండీ పారాయణం, నవగ్రహ జపం, రుద్రాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం సప్తశతి పారాయణం, మూలమంత్ర అనుష్ఠాన హోమం, శ్రీ పెద్దమ్మ తల్లి ఉత్సవ మూర్తికి పల్లకీ సేవ తదితర పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ చైర్మన్, బీఆర్ఎస్ నేత పి.విష్ణువర్ధన్‌రెడ్డి ఈ పూజల్లో పాల్గొన్నారు. -బంజారాహిల్స్

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

చిక్కడపల్లి: కార్మికులకు సంక్షే మ పథకాలను ప్రభుత్వమే వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేయాలని భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం(బీఎన్ఆర్‌కేఎస్) అధ్యక్షుడు అయిలన్న డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మిక వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలు చేస్తున్న స్కీంలను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని సోమవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ భవన, నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పగించి ప్రభుత్వం తన బాధ్యతల నుంచి తప్పుకోవాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

బహుమతులు ప్రదానం: మణికొండ మున్సిపాలిటీలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని అల్కాపూర్ టౌన్‌షిప్ లో గల జయశంకర్ పార్క్, మహాత్మాగాంధీ పార్క్‌లో రెండు గ్రౌండ్ లలో తెలంగాణ స్టేట్ లెవెల్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ క్రీడలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేసి సన్మానించారు. - మణికొండ ఫిబ్రవరి 3 :

దేవాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తా

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 3: దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో కల్యాణ మండపం పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 35 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న కళ్యాణ మండపం పనుల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు.

ఈ పనులు పూర్తైతే అన్ని వర్గాల ప్రజలు కళ్యాణాలు చేసుకునేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. ప్రహరీ గోడ, మరమ్మతు పనులు, సుందరీకరణ పనులపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు అక్కెం కృష్ణ, రావుల భాస్కర్, చిన్న జంగయ్య, దాసు, అనిల్‌ముదిరాజ్, సురేందర్‌ముదిరాజ్, పాండు యాదవ్, నవారు మురళీ, నర్సింహశర్మ, రఘు, చిన్న, లక్ష్మి, నాగమణి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయ ప్రాంగణంలో కళ్యాణ మండపం పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

అభివృద్ధి పనులు ప్రారంభం

ఖైరతాబాద్, ఫిబ్రవరి 3 : పంజాగుట్ట ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్‌లో రూ.10.09 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తితో కలిసి ప్రారంభించారు. జంక్షన్ల సుందరీకరణ ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని పంచుతామన్నారు. నగర ప్రజలు పలు సలహాలు ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డి, ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో అపశృతి

ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్‌లో సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న తరుణంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పుట్‌పాత్‌పై నడుస్తుండగా అదుపు తప్పి కిందపడిపోయారు. పక్కనే ఉన్న కాంగ్రెస్ శ్రేణులు వెంటనే ఆమెను పైకి లేపారు. ఈ ప్రమాదంలో మేయర్‌కు స్వల్ప గాయమైనట్లు వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్నారు.

ప్రారంభోత్సవంలో అపశృతి

పుట్‌పాత్‌పై నడుస్తూ కిందపడిపోయిన మేయర్

ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తదితరులు

నాలా పనులు పరిశీలన

ముషీరాబాద్, ఫిబ్రవరి 3: ముషీరాబాద్ డివిజన్ రాంనగర్ బాప్టి చర్చివద్ద కొనసాగుతున్న నాలా అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ సోమవారం పరిశీలించారు. పనులు చేపడుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, డ్రైనేజీ పైపులైన్ల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

నాలాల్లో పూడికతీత పక్కాగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ గీత, బీఆర్ఎస్ యూత్ విభాగం నేత ముఠా జయసింహ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధిని బలహీనపరిచేలా కేంద్రప్రభుత్వం

మైలార్‌దేవ్‌పల్లి/వెంగళరావునగర్, ఫిబ్రవరి 3: దేశాభివృద్ధిని బలహీనపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని సీపీఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు జాజాల రుద్రకుమార్ ఆరోపించారు. బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ కాటేదాన్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ, బడ్జెట్ కాపీలను దగ్ధం చేశారు. సీపీఎం పార్టీ రాజేంద్రనగర్ మండల సీనియర్ నాయకులు ఎస్.రామ్మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి రుద్రకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధిని బలహీనపరిచే విధంగా బడ్జెట్ ప్రవేశపెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు పి.సి.కె.భాస్కర్, కాలే రా జు, సచిన్, దత్తు, శశికాంత్, లక్ష్మణ్, యాదగిరి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన బుడతలు

నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నాచారంకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. యూసుఫ్‌గూడలోని కోట్లవిజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ముగిసిన జాతీయ స్థాయి పోటీల ఇండివిజవల్ కటా విభాగంలో ఆదిత్య, ఆధ్యా బంగారు పతకాలను.. కుమితి విభాగంలో ఆదిత్య బంగారు, ఆధ్యా కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పతకాలు, సర్టిఫికెట్లు బహూకరించారు. - జూబ్లీహిల్స్,ఫిబ్రవరి3

నిమ్స్ డాక్టర్ ఉషారాణికి లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

నిమ్స్ క్లినికల్ ఫార్మకాలజీ, థెరపిటిక్స్ విభాగాధిపతి డాక్టర్ ఉషారాణి పింగళి అరుదైన సత్కారాన్ని అందుకున్నారు. ఇటీవల ది ఇండియన్ సొసైటీ ఆఫ్ క్లినికల్ రిసెర్చ్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సదస్సులో ఆమెకు ఐఎస్‌సీఆర్ అధ్యక్షులు డాక్టర్ సనీష్ డేవిస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సీమా పాయి చేతుల మీదుగా అవార్డును లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉషారాణిని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప అభినందించి సత్కరించారు. - ఖైరతాబాద్, ఫిబ్రవరి 3: